


ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 27.0

సైలెంట్ పటాక్





గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. ప్రజాజీవితంలో అత్యంత కీలకంగా ఉండే విభాగాలు మూలన పడ్డాయి. అడిగే దిక్కులేదు.. సమా ధానం ఇచ్చే పరిస్థితి లేదు. ఆడిందే ఆట, పాడిందే పాటగా ఇష్టారాజ్యంగా సాగింది. ప్రజలచే ఎన్నుకోబడ్డ స్థానిక సంస్థలను చెత్తబుట్టదాఖలు చేశారు. రైతులకు ఉపయోగపడే సహకార సంఘాలతో చెలగాటం ఆడారు. సాగునీరు అందించే నీటి సంఘాలను పట్టించుకోలేదు. ఇలా ఒకటేంటి.. అన్ని నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, వ్యవస్థలు అన్ని తిరిగి పునరుద్ధరణ కావాలని, మేలైన పాలన జరగాలని ఆశించిన వారంతా అనుకున్నట్లుగానే కూటమిని అధికారం లోకి రప్పించారు. నియోజకవర్గాల్లో ప్రజా ప్రతి నిధులను వేల మెజార్టీతో గెలిపించారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రైతుల రుణ పరపతికి ఎంతో కీలకమైన సహకార సంఘాలకు ఎన్నికలు జరిగి దశాబ్దం కావొస్తోంది. అప్పటి టీడీపీ హయాంలో సహకార సంఘాల కాలపరిమితిని పొడిగిస్తూ వచ్చారు. అధికార పగ్గాలు చేజిక్కించుకున్న జగన్ అప్పటి వరకు ఉన్న సొసైటీలను రద్దు చేసి ఆ స్థానంలో త్రిసభ్య కమిటీలతోనే గడిచిన ఐదేళ్లగా రైతులతో ఓ ఆటాడుకున్నారు. మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తిప్పలుపడి గెలిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు సభ్యులే కాదు. ఆఖరికి సర్పంచ్‌లను జగన్ ప్రభుత్వం ఓ పావులుగా మార్చింది. ఆర్థిక స్వయం ప్రతిపత్తి లేని నామ్‌కా వాస్తే ప్రతినిధులుగా వీరంతా మిగిలిపోయారు. చేలకు నీరు ఎంత అవసరమో, కాల్వలకు నీటి నిర్వహణకు సంఘాలు అంతే అవసరం. కానీ 2016 నుంచి ఈ సంఘాలన్ని అటూ ఇటూ కాకుండా పోయాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలు మూలనపడ్డాయి. క్షేత్రస్థాయిలో అత్యంత కీలకమైన స్థానిక సంస్థలతో జగన్ ప్రభుత్వం ఆడిన చెలగాటం అంతా ఇంతా కాదు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 895 పంచా యతీల్లో కొన్నింటి మినహా, అన్నింటికి జరిగిన ఎన్నికల్లో అప్పట్లో ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నారు. ఏలూరు జిల్లాలో దాదాపు 547కు పైగా పంచాయతీలు ఉన్నాయి. వీటన్నింటికి ఎన్నికైన ప్రజాప్రతినిధులు తామంతా ఓటర్లకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రజారంజక పాలన చేద్దామనుకున్నారు. వీరి కోరికలపై జగన్ ప్రభుత్వం నీళ్ళు చల్లింది. సమాంతరంగా అప్పటికే గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. వలంటీర్లను రంగంలోకి దింపింది. చిన్నాచితక పనులను సైతం వీరే నిర్వహించేలా బాధ్యతలు అప్పగించింది. మరి ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్‌ల సంగతేంటి ? ఆయా గ్రామాల పాలక మండళ్ళ పరిస్థితి ఏంటి అనేదానికి సమాధానం లేకుండా పోయింది. దీనికి తోడు 14,15 ఆర్థిక సంఘం పంచాయతీలకు నిధులు కేటాయించింది. రాష్ట్రప్రభుత్వం మీకెందుకులే ఆ డబ్బు అన్నట్లుగా వేరే ఖాతాలకు మళ్ళించింది. పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ బోర్డులు గోలచేసినా, నిలదీసినా నోరు నొక్కేసింది. ఈ మూడున్నరేళ్ళలో ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజా ప్రతి నిధులు అంతా తోలు బొమ్మలుగా మిగిలిపోయారు. ప్రజలకు ఏసేవ చేయలేక పోయ్యామన్న సంతృప్తిలేక నిస్సహాయంగా మిగిలి పోయారు. మళ్లీ తిరిగి తాము కోలుకోవాలంటే జగన్ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం రావాలనే ఆకాంక్ష తోనే అంతర్గతంగా పనిచేసిన సర్పంచ్‌లు ఎందరో. వీరికి మద్ద తుగా గ్రామప్రజలు కూడా. కొత్త కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే తిరిగి స్థానిక సంస్థలకు నూతన వైభవం వచ్చితీరుతుందన్న ఆశ, ఆకాంక్షలోనే ఇప్పుడు వారంతా ఉన్నారు.

వైసీపీకి స్థానిక దెబ్బ

- జగన్ ప్రభుత్వంలో స్థానిక సంస్థల నిర్వీర్యం
- సొసైటీలకు ఎన్నికలు జరిగి ఎన్నాళ్లో..
- నిధులు మళ్లించి మింగేసిన పాలనా యంత్రాంగం
- ఉత్సవ విగ్రహాలుగా పంచాయతీ పాలక వర్గాలు
- నీటి సంఘాలను గాలికొదిలేశారు
- జిల్లా పరిషత్ ఉనికి ప్రశ్నార్థకం
- స్థానికి ప్రజాప్రతినిధుల్లో తీవ్ర అసంతృప్తి
- కూటమి విజయంలో ప్రభావం
- భారీ మెజార్టీ ఇచ్చింది ఈ అంశాలే
- కొత్త ఆశలతో ఎదురుచూపులు

ఉనికి లేని జిల్లా పరిషత్


ఇంకోవైపు జిల్లాపరిషత్ వ్యవస్థను పూర్తిగా దెబ్బతీసే ప్రక్రియలో భాగంగా నూతన జిల్లాలు ఏర్పాటయ్యాయి. దీని దరిమిలా జిల్లాపరిషత్ తన ఉనికిని కోల్పోయింది. చేద్దామంటే పనిలేదు. చేయిద్దామంటే నిధులు లేవు. నామ్‌కా వాస్తేగా కొన్ని పనులను పూర్తి చేశారు. మరికొన్ని పనులను చేపట్టి వదిలివేశారు. సుమారు 48 మంది జడ్పీటీసీ సభ్యులు, 837 మందికి పైగా ఎంపీటీసీలు, మరో 48 మంది ఎంపీపీలు గడిచిన నాలుగేళ్లుగా ఏపని చేయలేక మూడు నెలలకోమారు సమావేశం నిర్వహించి, చేతులు దులుపుకుంటూనే వచ్చారు. వారిలో గూడుకట్టుకొని ఉన్న అసంతృప్తి కూటమికి కలిసి వచ్చింది. ప్రజాప్రతినిధులు అత్యధికులు కూటమిపక్షానే పరోక్షంగా మొగ్గు చూపారు. వీరి ఆశ కూడా ఒక్కటే.. స్థానిక సంస్థలు బాగుపడాలంటే కాస్తంత నిధుల పర్యవేక్షణ ఉండా లన్నదే. దీనికి అనుగుణంగానే కూటమి ఏం చేయబోతుంది అన్నదే ఇప్పుడు వీరందరి ప్రశ్న.

నీటి సంఘాలను నిండా ముంచారు

ఒకప్పుడు వ్యవసాయ ఆధారిత ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కాల్వల ద్వారా నీటి నిర్వహణ చేసేందుకు సాగునీటి సంఘాలను తెరముందుకు తెచ్చారు. ఎక్కడికక్కడ డిస్ట్రి బ్యూటరీ కమిటీలను ఏర్పాటుచేసి ఆ తరువాత ప్రాంతాల వారీగా సాగునీటి సంఘాలను అమల్లోకి తెచ్చారు. ఉమ్మడి పశ్చిమలో 2016లో ఈ కీలకఘట్టానికి తెరతీసి అప్పట్లోనే ఎక్కడికక్కడ రైతులే ఆయా సంఘాలను ఎన్నుకునేలా జాగ్ర త్తలు తీసుకున్నారు. కొన్నింటిని నామినేట్ చేశారు. ప్రాజెక్టు కమిటీలను ఏర్పాటు చేసి చైర్మన్‌గా ఒకర్ని, ప్రభుత్వం నామినేట్ చేసేది. ఉమ్మడి పశ్చిమలో 160కి పైగా సాగునీటి సంఘాలు, 20కి పైగా డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఒక ప్రాజెక్టు కమిటీ ఉండేది. కాని ఈ ఐదేళ్ళలో ఈ వ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేశారు. నీటి సరఫరా జరుగుతుందా? లేదా? అని నిలదీసేందుకు ఆటు ఎమ్మెల్యేలు ప్రయత్నించ లేదు. ఇటు సాగునీటి సంఘాల నుంచి నిలదీసే ప్రతినిధులు కరువు అయ్యారు. అంటే ఆటు సహకార సంఘాలు, ఇటు సాగునీటి సంఘాలు అన్ని రైతువారి జీవితాలతో ముడిపడి ఉండేవే. కాని మీ వ్యవస్థ అంతా ఐదేళ్ళగా డమాల్..ఇప్పుడు ఈ వ్యవస్థలు అన్ని గాడిలో పెడతామన్న కూటమి హామీలు ఎంతమేరకు ఆచరణలోకి వస్తాయో ? ఎప్పటిలోపు కొత్త వ్యవస్థ ఆరంభం అవుతుందోనన్న ఆశతోనే అందరూ ఉన్నారు. మరి కూటమి ప్రభుత్వం ఎలాంటి కీలక నిర్ణయాలు భవిష్యత్తులో తీసుకుంటుందో వేచి చూడాలి.

సహకార సంఘాలు..చెల్లాచెదురు

రైతులకు రుణపరపతి కల్పించే క్రమంలో కీలకంగా వ్యవహరించేవే సహకార సంఘాలు. వీటన్నింటిని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2014 నుంచి 19 వరకు దఫాలవారీగా పాలనా కాలపరిమితిని పొడిగిస్తూ వచ్చింది. ప్రతి రెండేళ్ళకు ఒకసారి ఈ ప్రక్రియ కొనసాగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా 240కి పైగా ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిద్వారా వందల కోట్ల రూపాయలు రైతులకు, అవసరాలకు వీలుగా రుణసౌకర్యం కల్పించేవారు. ఎవరి జోక్యం లేకుండానే ఈప్రక్రియ సాగేది. 2019లో జగన్ అధికా రంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాల సీన్ మార్చేశారు. ఆ స్థానంలో తమ సొంతపార్టీకి చెందిన వారితో ఎక్కడికక్కడ త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేశారు. వీరిలో ఒకరు చైర్మన్‌గా, మరో ఇద్దరు సభ్యులుగా ఉండేలా ఏకపక్ష పాలనకు బాటలు వేశారు. ఇంతా చేసినా రైతులు ఆశలు, ఆకాంక్షలకు అను గుణంగా ఈ కమిటీలు ఏవీ పాలన చేయకపోగా, సహ కార సంఘాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. పర్యవేక్షణ కొరవ డంతో సహకార సంఘాలు నిర్వీర్యం అయ్యాయి. ఇక రైతులు, కౌలు రైతులు ప్రైవేట్ వడ్డీదారుల నుంచి బారీ వడ్డీలతో వ్యవసాయ పెట్టుబడులు తీసుకుని అనేకమంది ఇప్పుడు అప్పుల ఊబిలోనే ఉన్నారు. సహకార సంఘాలు బాగు పడేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుందని, ఈ వ్యవస్థ ఆశలతోనే వేలాది మంది ఉన్నారు. సహకార సంఘాల్లో పాతుకుపోయిన వ్యవస్థను ప్రక్షాళన చేస్తే తప్ప రైతులు ఊపిరి పీల్చుకోవడం కష్టమే.



రేపు సీఎం చంద్రబాబు పోలవరం రాక

- ప్రాజెక్టు పనుల పరిశీలన
- బాధ్యతలు చేపట్టాక తొలిసారి జిల్లాకు..

కొయ్యలగూడెం, జూన్ 15: పోలవరం పర్యటనకు సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాల రాజు శనివారం రాత్రి తెలిపారు. ఈ మేరకు సీఎం పోల వరం చేరుకుని ప్రాజెక్టు పనులను పరిశీలిస్తారని వివరించారు. గత ఐదేళ్లుగా ప్రాజెక్టు పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయని, తమ కూటమి ప్రభుత్వం రావడం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొట్టమొదటిగా ప్రాజెక్టును సందర్శించడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత కారణంగానే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం చంద్రబాబు పోలవరం పర్యటనకు రానుండడంపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

పురోగతిలో పోలవరం పనులు

- ఎస్ఈ నరసింహమూర్తి



పోలవరం, జూన్ 15 : పోలవరం ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయని పోలవరం ప్రాజెక్టు ఎస్ఈ నరసింహమూర్తి అన్నారు. శనివారం పోలవరం ప్రాజెక్టు అతిథి గృహం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాం గ్యాప్ 3 పనులు పూర్తయ్యాయని, గ్యాప్ 1, 2 ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం పనులు పూర్తి చేయాల్సి ఉంద న్నారు. డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో నూతనంగా నిర్మించాల్సి ఉందని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని, డిజైన్స్ ఆమోదం కాగానే డయాఫ్రం వాల్ నిర్మించాల్సి ఉంటుందని, గ్రౌండ్ ఇంప్రూవ్ మెంట్, వైబ్రో కాంపాక్షన్ పనులు, అనంతరం ఎంబాక్‌మెంట్ పనులు, మెయిన్ డ్యాం పనులు చేస్తామన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సయోధ్య స్నేహపూర్వకంగా ఉన్న నేపథ్యంలో పనులు మరింత వేగవంతంగా జరుగుతాయని రానున్న మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



కన్నాపురం-ప్రగడపల్లి రోడ్డుపై కూలిన భారీ వృక్షం

ఈదురు గాలుల విధ్వంసం

- రోడ్లపై కూలిన భారీ వృక్షాలు
- వాహనాల రాకపోకలు బంద్

పోలవరం, జూన్ 15 : పోలవరం మండలంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వీచిన ఈదురు గాలులకు పోలవరం మండలంలో పలుచోట్ల భారీ వర్షాలు నేల కూలాయి. పోలవరం నుంచి కన్నాపురం వెళ్ళే రోడ్డు మార్గంలో పలు చోట్ల భారీ వృక్షాలు నేలకూలడంతో కన్నాపురం, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం నుంచి పోలవరం రాకపోకలు సాగించే వాహనాలు, కొవ్వూరు పోలవరం మార్గంలో పట్టిసీమ వద్ద పలుచోట్ల భారీ వృక్షాలు రోడ్డుపై కూలిపోవడంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయి ప్రయాణీకులు లగేజీలతో కాలినడకన పోలవరం చేరుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తపట్టిసీమ సచివాలయం సమీపంలో రోడ్డుపై భారీ వృక్షం నేలకూలింది. అదే గ్రామానికి చెందిన పూడి వెంకట్రావు అనే రైతు ఇంటిపై భారీ వృక్షం కూలింది. ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



విద్యుత్ తీగలపై విరిగిపడిన తాటిచెట్టు



వాహనదారులు, ప్రయాణికుల పాట్లు

మసీదుల వద్ద పోలీస్ బందోబస్తు

ఏలూరు క్రైం, జూన్ 15 : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన మంత్రులు ఈద్‌గాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాం తి ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన మసీదులు, ఈద్‌గాల వద్ద సోమవారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలు ఆ పరిధిలో ఉన్న ముస్లిం మత పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని కాపాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఈ సమా వేశంలో కోరారు. మత మతసామ రస్యానికి ఎవరూ భంగం కల్గించకూడదని పోలీసు అధి కారులు తెలిపారు.



ఎయిడెడ్‌పై వేటు!

- గత వైసీపీ ప్రభుత్వంలో అస్తవ్యస్త విధానాల అమలు
- మూతపడే స్థితికి కె.కోటలోని దేవస్థానం కళాశాల
- ఈ ఏడాది అడ్మిషన్లు నిర్వహించాలని వినతులు

ద్వారకాతిరుమల, జూన్ 15 : గత జగన్ ప్రభుత్వం ఎయిడెడ్ విద్యా సంస్థలపై అకారణంగా కత్తి కట్టడం.. అక్కడ చదువుకునే విద్యార్థులకు కష్టాలను తెచ్చిపెట్టింది. కొవిడ్ ముందువరకు విద్యార్థులతో కళకళలాడిన ఆ కళాశాలకు గ్రహణం పట్టింది. విద్యార్థులు లేక మూత పడే పరిస్థితి నెలకొంది. ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధర్యంలో నిర్వహించే కామవరపుకోటలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల దుస్థితి ఇది. 1984లో 57 మందితో ప్రారంభమైన ఈ కళాశాల దినదినా భివృద్ధి చెందుతూ 400 మంది విద్యనభ్యసించే స్థితికి చేరుకుంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 14 మంది లెక్చరర్లు, పదిమంది బోధనేతర సిబ్బందిని నియమించారు. కాగా గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల కారణంగా అన్ ఎయిడెడ్ అయిన తర్వాత వీరి జీతభత్యాలు, విద్యార్థులకు ఉచిత భోజనం, ఇతర సదుపాయాల నిమిత్తం ఏటా రూ.1.10 కోట్లు పైబడి దేవస్థానికి ఖర్చు అవుతుంది. రాబడి తక్కువ ఖర్చు భారీగా ఉండడం, గతేడాది కళాశాలలో సిబ్బంది కంటే తక్కువ మంది విద్యార్థులు ఉండడంతో తాజాగా అడ్మిషన్‌లను నిలిపివేసే పరిస్థితి దాపురించింది. ఎంపీసీ, బైపీసీలలో ఇంగ్లీష్, తెలుగు మీడి యంలు, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో తెలుగు మీడియం కలిపి గతేడాది కేవలం 23 మంది విద్యార్థు లుంటే 24 మంది స్టాఫ్ ఉన్నారు. శ్రీవారి దేవస్థానం నాణ్యమైన విద్యను, సౌకర్యాలను అతి తక్కువ ఖర్చుతో విద్యార్థులకు అందించేందుకు పలు విద్యాసంస్థలను ప్రారంభించింది. దాదాపు వందమంది విద్యార్థులతో స్థానికంగా శ్రీ వేంకటేశ్వర వైఖానస ఆగమ పాఠశాల, శ్రీ వెంకటేశ్వర ఓరియంటల్ హైస్కూల్, కామవరపుకోటలో శ్రీ వేంకటేశ్వర జూనియర్ కాలేజ్, భీమడోలులో శ్రీ వేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలను ప్రారంభించింది. అయితే ఒక్క కామవరపుకోట కాలేజీ మినహా మిగిలిన వాటి పరిస్థితి బాగానే ఉంది.

ఎయిడెడ్ విలీనమే కారణమా..!

పలువురు దాతలు విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, వాటి ఏర్పాటుకు అవసరమైన భవనాలను నిర్మించి మౌలిక సదుపాయా లను కల్పించారు. కేవలం ఉపాధ్యాయులకు జీతాలను ప్రభుత్వం ఇస్తూ ఎయిడెడ్ విద్యా విధానాన్ని కొనసాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలల విలీనానికి తెరలేపడంతో పాటు దీనికి భిన్నంగా.... మీ ఆస్తులతో సహ మాకిచ్చేయండి... లేకుంటే మా సిబ్బందిని మాకిచ్చేయాలని రెండు ఆప్షన్లను ముందుపెట్టింది. ఒకవేళ అధ్యాపకులను వెనక్కి ఇచ్చేస్తే ఎయిడెడ్ ప్రైవేటుగా మారి పోతాయి. ప్రభుత్వ రాయితీలు, ఉపాధ్యాయులు సిబ్బందికి జీత భత్యాలు ప్రైవేటు వాళ్లే భరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కామ వరపుకోట కళాశాలలో విలీనం తర్వాత కష్టాలు ప్రారంభమ య్యాయి. విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో యాజ మాన్యం ఆలోచనలో పడి ఈ ఏడాది నూతన అడ్మిషన్లను తాత్కాలికంగా నిలుపుదల చేసింది.



ట్రస్టీ, ఈవోలతో చర్చిస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి

అడ్మిషన్లు ప్రారంభించాలని కోరిన ఎంపీ

శ్రీవారి దేవస్థానం ఆధ్వర్యంలో కామ వరపుకోటలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర జూనియర్ కాలేజి అడ్మిషన్లను పునరుద్ధరించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ సూచించారు. ఈ కళాశాల అడ్మిషన్లను దేవస్థానం నిలుపుదల చేసిందని ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పట్లో విచ్చేసిన ఎంపీ మహేష్ కుమార్‌కు, చింతల పూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఈ సమస్యను గుర్తుంచుకుని ఎంపీ శనివారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ద్వారకా తిరుమల దేవస్థానం అనువంశిక ధర్మకర్త ఎస్.నివృతరావు, ఈవో త్రినాథరావులతో చర్చించారు. అడ్మిషన్లను ప్రారంభించాలని వారిని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌కు స్థానికుల వినతి

మెట్ట ప్రాంతమైన కామవరపుకోటలో దేవస్థానం ఆద్వర్యంలో నడిపే ఈ కాలేజీలో 2024 మొదటి సంవత్సర అడ్మిషన్లను ప్రారంభించాలని ఆ ప్రాంత వాసులు కొందరు ఈ ఏడాది ఏప్రిల్ 29న చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఇక్కడి అడ్మిషన్లను నిలిపితే పలువురు పేద విద్యార్థులు అధిక ఫీజులు చెల్లించలేక చదువులు మానేసే అవకాశం ఉందని పెద్దమనసుతో అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభించాలని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కాలేజీ మూసేస్తే కామవరపుకోట, టి.నరసాపురం, ద్వారకా తిరుమల, పెదవేగి మండలాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడతారని పునరాలోచించాలని కోరారు. దీనిపై చైర్మన్ సుధాకరరావు స్పందిస్తూ కళాశాలను మూసివేయమని... కష్టమయినా ద్వితీయ ఏడాది ఇంటర్‌ను కొనసాగిస్తామని, మారుతున్న కాలానుగుణంగా భవిష్యత్‌లో ఐటీఐ, పాలిటెక్నిక్ ఇతర వృత్తివిద్యాకోర్సులను ఇందులో ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది.



చైర్మన్ సుధాకరరావుకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు (ఫైల్)

జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల విజేతలు



ఆర్చరీ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

భీమవరం అర్బన్, జూన్ 15: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఓల్గా ఆర్చరీ ఆకాడమీలో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా నలుములల నుంచి పలు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో అండర్-15 బాలిక కాంపౌండ్ విభాగంలో వి.స్ఫూర్తి, కె.హేమశ్రీ, వి.శ్రద్ధ, బాలుర విభాగంలో హ్రిషికేష్ నాయుడు, అండర్-13 బాలికలలో కె.తనన్య, కె.సమీక్షారెడ్డి, వి.శ్రద్ధ, బాలురలో జి.రిత్విక్, ఎ.హర్షవర్ధన్, అండర్-10 బాలికల విభాగంలో కోమలి స్పందనారెడ్డి, సత్య శివానాలు, అండర్-15 బాలికల రీకర్వే విభాగంలో కె.సాత్విక, ఎన్.హంసీని, అండర్-10 బాలుర విభాగంలో ఆర్.దృష్యంత్, అండర్-15 ఇండియా రౌండ్‌లో ఎస్.బస్సీరాజ్, అండర్-13లో పి.రిత్విక్ రాజ్, అర్జున్‌రాజ్, సీహెచ్ హర్షిత, ఎన్.శ్రీహాన్స్ విజేతులుగా నిలిచారని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 22, 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారిని జిల్లా సెక్రటరీ జయరాజు తెలిపారు.



ఎంపికైన క్రీడాకారులు

అండర్ -16 క్రికెట్ ప్రాబబుల్స్‌కు 23 మంది ఎంపిక

ఏలూరు స్పోర్ట్స్, జూన్ 15 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-16 బాలుర జట్టు ప్రాబబుల్స్ ఎంపిక పోటీలు శనివారం ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలలో నిర్వహించారు. 23 మందిని ఎంపిక చేసినట్టు ఏలూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్యవర్మ తెలిపారు.

ఎంపికైన వారు వీరే...

జె.సాయిరామ్‌చరణ్‌రాజు, వి.భవ్‌రాజ్, ఎ.అర్జున్, ఓ.రణధీర్, అఖిల్, కార్తీక్ ఎస్.తేజ్‌తరుణ్, జి.పూజిత, ఎం.మార్క్, బి.సత్యకిరణ్, ఎ.సురేష్, సీహెచ్ మోహిత్‌సాయి, నాగసాకేత్, దుర్గాకృష్ణప్రసాద్, శ్రీరఘురామ్‌నాయుడు, వి.ఎస్.వి.ఎన్ మాదూర్, వివేక్‌జైన్, కె.ప్రణయ్‌సాయిరామ్, జి.నిఖిల్‌మాణిక్యనాయుడు, సీహెచ్ సాత్విక్‌కుమార్, ఆర్.శ్రవణ్, డి.మేఘనాథ్, రోహణ్‌కృష్ణ, రాజారిత్విక్‌లను ఎంపిక చేసినట్టు కార్యదర్శి వి.వి.ఎస్.ఎన్ శ్రీనివాసరాజు తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 24 నుంచి జూలై 20వ తేదీ వరకు మంగళగిరిలో జరిగే ఏసీఏ అంతర్‌జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

21, 22 తేదీల్లో వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

ఏలూరు స్పోర్ట్స్, జూన్ 15:శాయ్ సెంటర్ ఆధ్వర్యంలో బాలికల వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలకు అర్హత పొందేందుకు శారీరక ధృఢత్వం పరీక్షలను ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహిస్తామని శాయ్ సెంటర్ ఇన్‌చార్జి టి.ఎస్.వి వినాయకప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరులోని అల్లూరి సీతారామ రాజు స్టేడియంలోని శాయ్ సెంటర్ రెసిడెన్షియల్ వసతిగృహంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. నిబంధనల ప్రకారం బాలికలను ఎంపిక చేసి శాయ్ సెంటర్లో ఉచిత భోజనం, వసతి, స్పోర్ట్స్ కిట్స్, రూ.వెయ్యి విద్యాఫీజు, వ్యక్తిగత బీమా అందజేస్తామన్నారు. ఈ పరీక్షలకు పదో తరగతి చదివి జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, స్పోర్ట్స్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకుని హాజరుకావాలన్నారు. మరింత సమాచారానికి 98853 12356 నంబరులో సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న సుబోద్‌మిత్రా, ఏలూరు నగరంలో ర్యాలీ దృశ్యం

అవిశ్రాంత పోరాటాలకు సిద్ధం కావాలి

» ఏఐకేఎంకేఎస్ కన్వీనర్ సుబోద్‌మిత్రా

ఏలూరు రూరల్, జూన్ 15: కేంద్ర, రాష్ట్రాల్లో వరుసగా అధికారంలోకి వచ్చిన పాలకులంతా రైతాంగ, ఆదివాసీ వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారని దీనికి వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐకేఎంకేఎస్ కన్వీనర్ సుబోద్‌మిత్రా పిలుపునిచ్చారు. ఏలూరు టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్ ప్రాంగణంలో మూడురోజుల పాటు జరిగే రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సభలకు ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి ప్రారంభ ఉపన్యాసం చేశారు. తొలుత సంఘం పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బలమైన రైతాంగ ఉద్యమం సాగాలన్నారు. ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ రైతుల హక్కుల సాధనకు ప్రాణాలైన అర్పించి పోరాటాలు సాగించాలన్నారు. తొలుత రాష్ట్రసహాయ కార్యదర్శి తంతులూరి వర్మ ఆధ్వర్యంలో అమరులైన వారికి జోహార్లు అర్పిస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి రైతుకూలీలు, గిరిజనులు, గ్రామీణపేదలు తరలివచ్చారు. ఏఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు జి.విజయ్‌కుమార్, జె.కిషోర్‌బాబు, ఒడిశా నాయకులు శ్రీకాంత్‌మొహంతి పాల్గొన్నారు.

నగరంలో భారీ ప్రదర్శన

కార్యక్రమంలో భాగంగా వందలాది మంది రైతు కూలీలు, ఆదివాసీలతో నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. టుబాకో మర్చంట్స్ హాలు నుంచి ర్యాలీ ప్రారంభమై మునిసిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ వద్దకు చేరుకుంది. ఆదివాసీల సంప్రదాయక పింజరీ నృత్యం, డప్పు నృత్యాలు ఆకట్టుకున్నాయి. బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ ప్రజా అనుకూల విధానాల కోసం కేంద్ర, రాష్ట్ర పాలకులను నిలదీయాలని పిలుపునిచ్చారు.



ఉపశమనంపై ఆశలు!

కూటమి ప్రభుత్వ చర్యలపై టీచర్లు, విద్యార్థుల ఆకాంక్ష

» జగన్ ప్రభుత్వ పాలనలో విద్యారంగం విధ్వంసం

» ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గే అవకాశం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 15 : సాఫీగా సాగిపోతున్న విద్యావ్యవస్థను వరుసగా ఐదేళ్లపాటు విధ్వంసకర విధానాలతో అటు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఇటు ఉపాధ్యాయులకు జగన్ ప్రభుత్వం విసుగెత్తించిన నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా కొలువుతీరిన చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకోనున్న ఉపశమన చర్యలపై ఆశలు, ఆకాంక్షలు విద్యారంగంలో వ్యక్తమవుతున్నాయి. అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం మెగా డీఎస్సీపైచేయగా, ఆ మేరకు నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు ఎంతో ఊరట లభించినట్టయింది. ఇక ఏకపక్షంగా విద్యావిధానంలో పెనుమార్పులతో భ్రష్టు పట్టించిన గత ప్రభుత్వం బలవంతంగా అమలుచేసిన పలు విద్యాకార్యక్రమాలతోపాటు, టీచర్లపై వేధింపులకు కారణమైన విపరీత పోకడలనుంచి విముక్తిని ఉపాధ్యాయవర్గాలు కోరుకుంటున్నాయి. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో విద్యారంగ స్థితిగతులు, చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై ఓ పరిశీలన ఇది.

నగదు సాయం పథకంపైనే అందరి దృష్టి

పిల్లలను పాఠశాలకు పంపించినందుకుగాను విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాకు ఏడాదికి రూ.15వేలు నగదుసాయాన్ని జమచేస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఆ హామీని పూర్తిస్థాయిలో నిలబెట్టుకోలేకపోయింది. నగదులో రూ.2వేలను స్కూల్ టాయిలెట్, మెయింటెనెన్స్ ఖర్చుల కోసమంటూ మినహాయించుకుని మిగతా రూ.13వేలను జమ చేసినా, సిక్స్ స్టెప్ వెరిఫికేషన్‌లో ఈ అమ్మఒడికి అనర్హులంటూ వేల సంఖ్యలోనే విద్యార్థుల తల్లులకు ఆర్థిక లబ్ధిని దూరంచేసింది. ఐదేళ్ల కాలానికి అమ్మఒడి ఇస్తామన్న ప్రభుత్వం ఇటీవల గద్దె దిగేనాటికి నాలుగేళ్ళమాత్రమే అమలుచేసింది. ఈ క్రమంలో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అమ్మఒడి స్థానే తల్లికి వందనం పేరిట నగదుసాయం పథకాన్ని పిల్లల సంఖ్యతో నిమిత్తంలేకుండా కుటుంబంలో ఎంతమందివున్నా కోతలేకుండా ఒకొక్కరికి రూ.15వేలు ఇస్తామని ఎన్నికల హామీగా ప్రకటించింది. ఆ ప్రకారం ఏలూరు జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతివరకు చదువుతున్న బాలబాలికల సంఖ్య 2,98,361మంది ఉండగా, పశ్చిమ గోదావరి జిల్లాలో 2,15,000 మంది ఉన్నారు. వీరిలో ఎంతమందికి అమ్మఒడి నగదుసాయాన్ని వర్తింపజేస్తారో తేలాల్సి ఉంది.

విలీన తరగతులను వెనక్కి రప్పించాలి..

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా తొలి నాళ్ళనుంచి కొనసాగుతున్న పాఠశాల విద్యావ్యవస్థను జీవో 117 ఉత్తర్వులతో రద్దుచేసి, దానిస్థానే ఎనిమిదంచెల తరగతులు/పాఠశాలలను ప్రజలకు ఇష్టంలేకపోయినా బలవంతంగా రుద్దటంతోనే రాష్ట్రంలో ప్రభుత్వవిద్యారంగం పతనావస్థ ప్రారంభమైంది. ఈ ఉత్తర్వులతో ఏలూరు జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను కిలోమీటరు దూరంపైగావున్న ఉన్నత పాఠశాలల్లోకి విలీనం చేశారు. ఈ విధానం వల్ల బాలబాలికలు సుమారు 11 వేలమంది, పశ్చిమ గోదావరి జిల్లాలో 13,914 మంది ప్రైవేటు పాఠశాలలవైపు తరలిపోయినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జీవో 117 ఉత్తర్వులను రద్దుచేసి, విలీనమైన ప్రాథమిక తరగతులను మళ్ళీ సంబంధిత ప్రైమరీ స్కూళ్ళలోకి తెస్తే స్థానికంగా పిల్లలకు అందుబాటులో ఉంచినట్టవుతుంది. ఈ ఉత్తర్వులపై ప్రభుత్వం సమీక్షకు సిద్ధపడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

మాతృ భాషకు మళ్లీ మంచి రోజులు

ఒకటో తరగతి నుంచే 'టోఫెల్', ఆంగ్ల మాధ్యమ బోధనలతో పాఠశాల విద్యారంగమంతా పరాయిభాష బారిన పడడంతో మాతృభాష తెలుగు మాతృభాషగా మిగిలిపోయే దుస్థితిని జగన్ ప్రభుత్వం తీసుకురాగా, ఈ అవాంఛనీయ పరిస్థితులనుంచి తెలుగు మాధ్యమ బోధనకు కొత్తప్రభుత్వం మళ్లీ వెలుగు తీసుకువస్తుందని భాషాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ప్రతీ పాఠశాలలో ఆంగ్లమాధ్యమ బోధనకు సమాంతరంగానే తెలుగుమాధ్యమ బోధనకు మళ్లీ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుందని తెలుస్తోంది.

హైస్కూల్ ప్లస్‌ల వైఫల్యం

ఇంటర్‌విద్యతో మండలానికో జడ్పీ హైస్కూలులో రెండేళ్ళక్రితం ప్రారంభించిన హైస్కూల్ ప్లస్(జడ్పీ జూనియర్ కళాశాలలు) ఏ విధంగానూ చెప్పుకోదగ్గ పనితీరు కనబర్చలేదు. వీటిల్లో రెండేళ్లపాటు ఇంటర్ తరగతులు నిర్వహించినప్పటికీ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో అత్యంత దారుణమైన ఉత్తీర్ణతతో అపజయాన్ని చవిచూశాయి. గత విద్యాసంవత్సరంలో ఏలూరు జిల్లాలో మొత్తం 24 చోట్ల హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించగా ఒక్కోదానిలో మూడు గ్రూపుల్లో కలిపి కనీసం 120మంది విద్యార్థులు ఉండేలా ఏర్పాట్లు చేసినప్పటికీ మొత్తం అన్ని చోట్లాకలిపి 302మంది మాత్రమే ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్మిషన్లు తీసుకోవడం గమనార్హం. ఇక వీరినుంచి ఈ ఏడాది మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షలు రాసినవారిలో ఉత్తీర్ణుల సంఖ్యను గమనిస్తే ప్రథమ సంవత్సరంలో 71మంది, ద్వితీయ సంవత్సరంలో 32మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 16 చోట్ల హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించారు. ప్రథమ ద్వితీయ సంవత్సర విద్యార్థులు 326 మంది ఉన్నారు. హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చూపించిన హడావుడి తప్ప వీటికి క్షేత్రస్థాయిలో విద్యార్థులనుంచి తగినంత ఆదరణ లేదనడానికి ఫలితాలు, అడ్మిషన్లే నిదర్శనమని చెప్పవచ్చు.

యాప్‌ల భారం నుంచి టీచర్లకు ఊరట ఛాన్స్

బోధనాబాధ్యతకంటే ఉపాధ్యాయులకు పదుల సంఖ్యలో పనుల వివరాలను పలు యాప్‌లలోకి అప్‌లోడ్ చేయడంతోనే పనికాలమంతా సరిపోతోందని ఉపాధ్యాయ సంఘాలతోసహా, రాష్ట్రవ్యాప్తంగా టీచర్లు ఐదేళ్ళుగా గగ్గోలు పెడుతున్నారు. స్కూలులో పాఠ్యాంశాలను బాలబాలికలకు బోధించాల్సిన సమయంలో దానిని పక్కకబెట్టి మరుగుదొడ్లు, శానిటరీ, విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నపుడు, ఎండీఎం లెక్కలు, నిల్వల సమాచారాన్ని యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి రావడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు చాన్నాళ్ళుగా అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. యాప్‌ల భారంపై కొత్తప్రభుత్వం సమీక్షించి సడలింపు ఇస్తుందనే ఆశలు ఉపాధ్యాయవర్గాల్లో ఉన్నాయి.

విద్యాప్రమాణాలు పెంచేందుకే తొలి ప్రాధాన్యం

ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సమన్వయం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలను పెంచేందుకే ఈ ఏడాది తొలి ప్రాధాన్యతనిస్తాం. గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ నియామకాల కోసం నోటిఫై చేసిన 228 పోస్టులకు అదనంగా సుమారు 500 వరకు పోస్టులను చేర్చి మెగా డీఎస్సీలో నోటిఫైచేసే అవకాశం ఉంది. ఈ పోస్టులసంఖ్య అధికారికంగా నిర్ధారణ కావాల్సిఉంది. హైస్కూళ్ళకు సబ్జెక్టు టీచర్ల నియామకాల అవసరం ఉంది. పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు గతేదాదికంటే మెరుగైన ఉత్తీర్ణతే వచ్చింది. దీనిని మరింత పెంచుకుని 90శాతం లక్ష్యానికి చేరుకునేలా జూలైనుంచే కార్యాచరణను ఉన్నత పాఠశాలల్లో ప్రారంభిస్తాం.

– డీఈవో అబ్రహం, ఏలూరు జిల్లా

40 నెలల తరువాత సర్పంచ్‌గా అవకాశం ?

» రెండు ఓట్లతో గెలుపొందినా ఓటమి చవిచూసిన వైనం

» రెండున్నరేళ్ల ఒప్పందం మీరి పదవిలో కొనసాగింపు

» కూటమి గెలుపుతో ప్రస్తుత సర్పంచ్ రాజీనామా



హేమసుందర్

పెదపాడు, జూన్ 15 : ప్రజ్యాస్వామ్యబద్ధంగా ప్రజలు వేసిన ఓట్లతో గ్రామ సర్పంచిగా ఎన్నికైనా, ఆ తరువాత జరిగిన అనూహ్య పరిణామాల నేపథ్యంలో అప్పటి అధికార పార్టీ వైసీపీకి చెందిన వ్యక్తి గ్రామ సర్పంచ్ పదవిని చేజిక్కించుకోగా, సుమారు 40 నెలల తరువాత తిరిగి పంచాయతీ సర్పంచ్ పదవి దక్కనున్న ఘటన పెదపాడు మండలం సకలకొత్తపల్లి గ్రామంలో త్వరలో చోటు చేసుకోనుంది. 2021 ఫిబ్రవరిలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అప్పుడు ప్రతిపక్షంలో వున్న టీడీపీ బలపర్చిన అభ్యర్థిగా లావేటి హేమసుందర్, అధికారంలో వున్న వైసీపీ బలపర్చిన వ్యక్తిగా చేపెని వెంకటరంగారావు ఎన్నికల బరిలోకి దిగారు. కౌంటింగ్ అనంతరం హేమసుందరం రెండు ఓట్లతో ఆధిక్యత లభించగా, గెలుపు ప్రకటించని అధికారులు గందరగోళ పరిస్థితుల నడుమ వైసీపీ ఏజెంట్ల కోరిక మేరకు తిరిగి రీకౌంటింగ్ నిర్వహించారు. ఈ హైడ్రామా అర్ధరాత్రి వరకూ కొనసాగగా, అందరిలోనూ ఒక్కటే ఉత్కంఠ. రీకౌంటింగ్‌లో టీడీపీ అభ్యర్థి హేమసుందర్ ఖాతాలోని రెండు ఓట్లను చెల్లని ఓట్లుగా అధికారులు ధ్రువీకరించారు. ఫలితం డ్రాగా మిగిలింది. అనంతరం జరిగిన పరిణామాలతో ఇరుపార్టీల నాయకులు, గ్రామ పెద్దల సమక్షంలో ఐదేళ్ల పదవిని చెరో రెండున్నరేళ్లు నిర్వహించేలా ఒప్పందం చేసుకున్నారు. అధికారులు లాటరీ పద్ధతిని ఎంచుకుని ఇరుపక్షాల సమక్షంలో లాటరీ తీసి వైసీపీ మద్దతుతో బరిలో దిగిన రంగారావును తొలుత సర్పంచ్‌గా ప్రకటించారు. తొలుత సర్పంచిగా బాధ్యతలు స్వీకరించిన రంగారావు ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల తరువాత సర్పంచ్ పదవిని అప్పగించాల్సి ఉండగా ఒప్పందాన్ని మీరి సర్పంచి పదవిలో కొనసాగుతూ వచ్చారు. గడువు ప్రకారం హేమసుందర్‌కు పదవిని అప్పగించాలని అటు టీడీపీ నాయకులు, ఇటు పెద్దలు కోరినా ససేమిరా అన్నారు. చేసేది లేక హేమసుందర్ మిన్నకుండిపోయారు. తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో చేసేదీ లేక సకలకొత్తపల్లి సర్పంచ్‌గా వున్న చేపెని రంగారావు శనివారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో తన రాజీనామాను అందజేశారు. సర్పంచి రాజీనామాను డీపీవో కార్యాలయానికి పంపి తదుపరి ఆదేశాల మేరకు ముందుకెళ్తామని కార్యాలయ ఏవో రవికుమార్ తెలిపారు. రెండు ఓట్లతో గెలుపొందినా అనూహ్య రీతిలో సర్పంచ్ పదవిని చేజార్చుకున్న హేమసుందర్ తిరిగి నలభై నెలల తరువాత సర్పంచిగా బాధ్యతలు చేపట్టే అవకాశం కలిగినట్టుయింది.

శ్రీవారి క్షేత్రం.. భక్తజనమయం

ద్వారకాతిరుమల, జూన్ 15 : ఏడుకొండలవాడి నామాలను కీర్తిస్తూ వేలాదిగా భక్తులు చిన్నతిరుమల క్షేత్రానికి శనివారం విచ్చేశారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజుకావడంతో దాదాపు 25 వేల మందికి పైబడి యాత్రికులు క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుఝామునుంచే ఆలయానికి యాత్రికుల రాక ప్రారంభమైంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తజనులతో సందడిగా మారాయి, కొబ్బరికాయలు కొట్టి, తలనీలాలు సమర్పించుకుని పలువురు భక్తులు మొక్కుబడులను తీర్చుకున్నారు. శ్రీవారి ఉచిత దర్శనానికి మూడు గంటల పైబడి సమయం పట్టింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి భక్తుల రద్దీ కాస్త తగ్గింది. దర్శనానంతరం భక్తులు శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



కళాతోరణం వేదిక వద్ద చిన్నారుల కోలాటం

అలరించిన చిన్నారుల కోలాట ప్రదర్శన

శ్రీవారి ఆలయ శ్రీహరి కళాతోరణ వేదిక వద్ద చిన్నారులు నిర్వహించిన కోలాట, నృత్య ప్రదర్శన చూపరులను అలరించింది. లింగపాలెం మండలం ముడిచర్లకు చెందిన చిన్నారులు, కొంతమంది మహిళలు ముందుగా స్వామి అమ్మవార్లను దర్శించి పూజించారు. అనంతరం కళాతోరణవేదిక వద్ద పలు దేవతామూర్తులను కీర్తిస్తూ కోలాట ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

చంద్రబాబుపై అభిమానంతో..



గుండెల నిండా చంద్రబాబుపై అభిమానం.. పార్టీ అంటే విపరీతమైన ఇష్టం వెరసి ఓ టీడీపీ నేత మోకాళ్లతో శ్రీవారి ఆలయ మెట్లెక్కాడు. చేతిలో చంద్రబాబు ఫొటో పట్టుకుని మెట్టు మెట్టుకు కొబ్బరికాయ కొడుతూ తన మొక్కుబడిని తీర్చుకున్నాడు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అతడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నిరుపయోగమైన స్థలాలు విక్రయిస్తున్నాం

» బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ శ్రీను



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను తదితరులు

పాలకొల్లు అర్బన్, జూన్ 15 : తమ సంస్థలకు చెందిన ఆస్తుల్లో కొన్ని నిరుపయోగంగా ఉండడంతో వాటిని ఈ-ఆక్షన్ ద్వారా విక్రయానికి పెట్టామని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను (ఏలూరు) తెలిపారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థకు చెందిన పాలకొల్లులో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో విజయ ఆర్థో ఆసుపత్రి వెనుక భాగంలో పడమర, దక్షిణం రోడ్లు కలిగిన ఎం.1.03 సెంట్ల స్థలం ఖాళీగా ఉండ టంతో గజం రూ.22 వేలు విలువైన ఆ స్థలాన్ని ఈ-ఆక్షన్ ద్వారా ఈనెల 13న బిడ్ తెరిచామని, జూలై ఒకటో తేదీ సాయంత్రం మూడు గంటల వరకూ బిడ్‌ను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవచ్చన్నారు. జూలై 2వ తేదీన బిడ్స్ ఓపెన్ చేస్తామన్నారు. వివరాలకు 94906 44555, 94901 22622, 94235 65008 నంబర్లలో సంప్రదించాలన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ కేఎస్‌వీజీ సోమయాజులు, డీఈ పి.వెంకటరత్నం, ఎం. వెంకటరత్నం, ఎం మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

1,750 క్వింటాళ్ల విత్తనాలు అందించాం



మాట్లాడుతున్న ఏడీఆర్ శ్రీనివాస్

పెనుమంట్ర, జూన్ 15 : జిల్లాలోని రైతులకు ఈనెల 5, 6 తేదీలలో 1,750 క్వింటాళ్ళ ఎంటీయూ రైస్ 1,318 రకాన్ని రైతులకు సరఫరా చేశామని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ డి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం పరిశోధనా స్థానంలో శిక్షణ, సందర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుమారు 82.5 క్వింటాళ్ల జిల్లా వ్యవసాయ శాఖకు గ్రామీణ విత్తన పథకం కోసం సరఫరా చేశామన్నారు. ఎంటీయూ రైస్ 1,318 రకంతో పాటు ఎంటీయూ 2626 రకం ఐదు క్వింటాళ్ళ బ్రీడర్ విత్తనాన్ని రైతులకు అందించామన్నారు. 2024-25 పంటకాలంలో శాస్త్రవేత్తల బృందాలను ఏర్పాటు చేసి రైతులు పొలాలను సందర్శించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతానికి తాడేపల్లిగూడెం, పెంటపా డు, తణుకు మండలాలలో మాత్రమే నారుమళ్ళు పడ్డాయన్నారు. జిల్లాకు కావలసిన 56 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల మోతాదులో సుమా రు 46 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంత రం ఆచంటకు చెందిన అభ్యుదయ రైతు. నెక్కంటి సుబ్బారావును ఘనం గా సత్కరించారు. డాక్టర్ ఎం.వి.కృష్ణాజీ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవం



సర్వతో భద్రమండలి అరాధనకు సిద్ధం

ద్వారకాతిరుమల, జూన్ 15 : శ్రీవారి క్షేత్రదేవతగా వెలుగొందుతున్న కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి ఉపాల యమైన ఈ ఆలయంలో త్రయాహ్నిక దీక్షతో జరుగు తున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని విశేషపుష్పమాలలతో అలంకరించారు. ఉదయం గణపతిపూజ, సర్వతో భద్రమండలి ఆరాధన, మూల మంత్ర అనుష్ఠానం, హోమాలను ఆలయ ప్రధాన అర్చకులు పుసులూరి భైరవస్వామి నేతృత్వంలో జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భీమవరం క్రైం, జూన్ 15 : భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన ఓ యువకుడు కలుపు నివారణ మందు తాగి మృతి చెందాడని, టూటౌన్ ఎస్ఐ సీజే ప్రసాద్ శనివారం తెలిపారు. రాయలంకు చెందిన శేషయ్య కుమారుడు బాలవెంకట దుర్గాచైతన్య(23) సొంత అవసరాలకోసం కొంత మొత్తం అప్పులు చేసి అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 11న కలుపు నివారణకు వాడే మందుతాగి ఆ విషయాన్ని మేనమామ మల్లేశ్వరరావుకు ఫోన్‌లో తెలిపాడన్నారు. వెంటనే అతడిని చికిత్స కోసం భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారని, మెరుగైన చికిత్స కోసం ఏలూరు అనంతరం విజయవాడ ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించడంతో బతకటం కష్టమని వైద్యులు తెలపడంతో ఇంటికి తీసుకువస్తుండగా మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి శేషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం.. కేసు నమోదు



శ్రీరామరాజు (ఫైల్)

ముదినేపల్లి, జూన్ 15 : ముదినేపల్లి మండలం దేవరం గ్రామంలోని ఓ చేపల చెరువుపై కాపలా ఉంటున్న పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలికి చెందిన దండు శ్రీరామరాజు(76) అదృశ్యమయ్యాడు. మూడు రోజులుగా ఆ వృద్ధుడు ఆచూకీ లభించలేదు. ఈ నెల 13న శ్రీరామరాజు కాపలా ఉంటున్న చెరువు నుంచి ఆవు పారిపోతుండగా.. పట్టుకునేందుకు వెంబడిస్తూ వడాలి వరకు వెళ్లాడు. ఆవు ఎటుపోయిందో తెలియలేదు. వెంబడించిన ఆ వృద్ధుడు తిరిగి ఇంటికి రాలేదు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు పలు చోట్ల అతడి ఆచూకీ కోసం ప్రయత్నించినా జాడ తెలియలేదు. శనివారం ముదినేపల్లి పోలీసులకు అదృశ్యంపై కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

మాధవరంలో ట్రాక్టర్ చోరీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 15: ఇంటి ముందు నిలిపిన లోడు ట్రాక్టర్ చోరీకి గురైన ఘటన తాడేపల్లిగూడెం మండలం మాధవరంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. కౌలూరి రామకృష్ణ తన పొలంలో కొబ్బరి కాయలు దింపించి ట్రాక్టర్‌లో లోడు చేసి శుక్రవారం సాయంత్రం ఇంటి ముందు పార్క్ చేశాడు. ఆ ట్రాక్టర్‌ను రాత్రి ఒంటి గంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తీసుకుపోవడాన్ని సీసీ కెమెరాలో గుర్తించారు. ఆ ట్రాక్టర్, ట్రక్కు. విలువ రూ.6 లక్షలు ఉంటుందని. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రైతు తెలిపారు.

లారీని ఢీకొట్టిన స్కూల్ బస్సు.. తప్పిన ప్రమాదం



స్కూల్ బస్సు ముందుభాగంలో అద్దం పగిలిన దృశ్యం

పోడూరు, జూన్ 15 : పాలకొల్లు-మార్టేరు ప్రధాన రహదారిపై వేడంగి వద్ద శనివారం సాయంత్రం లారీని ఆదిత్య స్కూల్ బస్సు ఢీకొట్టింది. దీంతో స్కూల్ బస్సు ముందు భాగంలోని అద్దం పగిలిపోయింది. బస్సులో ఉన్న విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ప్రమాదం తప్పింది. స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులను ఇంటికి తీసుకెళ్తున్న స్కూల్ బస్సు ఎదుటగా వెళ్లున్న లారీని తప్పించే క్రమంలో ప్రమాదం జరిగింది. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న స్కూల్ యాజమాన్యం వేరొక బస్సులో విద్యార్థులను సురక్షితంగా ఇళ్ల వద్ద దింపారు.

మల్లుకుంటలో ఫ్లెక్సీల ధ్వంసంపై వివాదం

టి.నరసాపురం, జూన్ 15 :మల్లుకుంట పంచాయతీలోని మల్లుకుంటలో ఫ్లెక్సీల ధ్వంసంపై వివాదం చెలరేగింది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపొందడంతో స్థానిక కూటమి నాయకులు గ్రామంలో ఐదు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిని వైసీపీకి చెందిన కొంతమంది యువకులు ధ్వంసం చేశారని ఆరోపిస్తూ గ్రామంలో కూటమి నేతలు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన వైసీపీ నాయకులకు బుద్ధిరాలేదని విమర్శించారు. కూటమి గెలుపుతో సంతోషంగా ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను కొంతమంది వైసీపీ నాయకులు ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. గ్రామీణ వాతావరణంలో అన్ని సామాజిక వర్గాల మధ్య మంచి వాతావరణం కల్పించాలని హితవు పలికారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమిలు సహజమే అన్నారు. ఎన్నికల అనంతరం అందరూ ఒకటేనన్నారు. ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చించిన ఫ్లెక్సీల వద్ద నిరసన తెలిపారు. అనంతరం గ్రామ వైసీపీ నాయకుడు విచ్చేసి ఇరువర్గాలకు సర్ధిచెప్పడంతో నిరసన విరమించారు.



చించిన ఫ్లెక్సీల వద్ద నిరసన తెలియచేస్తున్న టీడీపీ నాయకులు

కూటమి నాయకులు పేరుబోయిన శ్రీనివాస్, తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి మోహనరావు, కాల్నీడి రాంబాబు, గండబోయిన శ్రీను, జోసుబోయిన సోంబాబు, సాధనాల బూసిబాబు, ఆర్.వేములయ్య, అప్పలరాజు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలకు కాలి నడకన కూటమి శ్రేణులు



కాలినడకన ద్వారకాతిరుమల వెళుతున్న టీడీపీ, జనసేన నాయకులు

పోలవరం, జూన్ 15 : పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి తెల్లం బాలరాజు విజయం కోసం చినవెంకన్నకు మొక్కు తీర్చుకునేందుకు టీడీపీ జనసేన నాయకులు శనివారం ద్వారకాతిరుమల కాలినడకన బయల్దేరి వెళ్లారు. గ్రామస్తులు వారిని మేళతాళాలతో, తీన్‌మార్ వాయిద్యాలతో గ్రామ శివార్ల వరకూ సాగనంపారు. ఈ కాలినడక మొక్కుల కార్యక్రమంలో ఎల్లండీపేట గ్రామం నుంచి టీడీపీ జనసేన గ్రామ నాయకులు తేలే నరసింహమూర్తి, చిక్కాల శ్రీను, ప్రగడ పల్లి నుంచి మామిడిపల్లి ప్రసాద్, కొవ్వాడ నుండి పాదం నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నేతలు



ద్వారకాతిరుమల పాదయాత్రగా వెళుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

లింగపాలెం, జూన్ 15: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సీఎం కావాలని ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామిని మొక్కుకున్నట్లు రంగాపురం గ్రామ శివారు నాగళ్లగూడెం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. రంగాపురం సర్పంచ్ ముసునూరి రాము ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వామి దర్శనానికి కాలి నడకన వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** జిల్లాలో ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం జరుపుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సుఖ సంతోషాల నడుమ బక్రీద్ పండుగ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.
- **పోలవరం :** మండలంలో అంగన్వాడీలో చదివి ప్రాథమిక పాఠశాల చదువులకు వెళుతున్న శిశువులకు పలుచోట్ల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్వాడీల సూపర్‌వైజర్ రాణి, ప్రీ స్కూల్ కృష్ణ, శిశువుల తల్లిదండ్రులు, ఇటుకలకోట, కొమ్ముగూడెం, వెంకటరెడ్డిగూడెం, తోటగొంది, జగన్నాధపేట, కమ్మరగూడెం గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.
- గూటాలలో నూతనంగా నిర్మించిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని స్థానిక నాయకులు శనివారం ఆవిష్కరించారు. టీడీపీ మాజీ మండల అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, గూటాల సర్పంచ్ ప్రసాద్, కొత్తపట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ ప్రసాద్, తెలుగు యువత అధ్యక్షులు పెద్దేహపు సత్యన్నారాయణ, తోలేటి రఘు, ఉండ్రాజవరపు మూర్తి, వెంటకరెడ్డి, జగ్జీవన్ రామ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.
- **పెదపాడు :** కలపర్రులోని శ్రీరాజగోపాలస్వామి, భీమేశ్వరస్వామి దేవాలయాలకు సంబంధించి వీరమ్మకుంట పరిధిలో గల చేపల చెరువుల లీజుకు సంబంధించిన వేలాన్ని వీరమ్మకుంట పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. మూడేళ్లకు గాను 16.75 ఎకరాలను అదే గ్రామానికి చెందిన కలిపిండి సత్యనారాయణ ఎకరం రూ.50 వేల చొప్పున, 19.8 ఎకరాలను దాసరి వెంకట అప్పారావు ఎకరం రూ.51 వేల చొప్పున దక్కించుకున్నారని ఆయా దేవాలయాల ఈవో ప్రకృతాంబ తెలిపారు.
- **చింతలపూడి :** జూన్ 29న జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి టి.మధుబాబు సూచించారు. చింతలపూడి కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహించి, అందులో రాజీపడదగ్గ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు.
- స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం శ్రీరంగం శ్రీనివారావు (శ్రీశ్రీ) 41వ వర్ధంతి సయ్యద్‌రసూల్ అధ్యక్షతన జరిగింది. రచయితలు మల్లెల జయరాజు, సూర్యకుమార్, మారుమూడి థామస్, నిమ్మగడ్డ అశోక్, సర్వేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.
- **కామవరపుకోట :** : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 190 మందికి పరీక్షలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పత్తి పుల్లయ్య, జనార్దనరావు, కేఎస్ఎస్ఎస్ నరసింహారావు, బచ్చు వీర వెంకట ముత్యాలరావు, నల్లూరి శివరామకృష్ణమూర్తి, తదితరులు రోగులకు అల్పాహారం, భోజనం ఏర్పాటు చేశారు.
- **ఏలూరు కలెక్టరేట్ :** ప్రధాని మోదీ ఢిల్లీలో ప్రమాణం చేస్తున్న సమయంలో జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ విశ్వ హిందు పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద నాయకులు నిరసన తెలిపారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉగ్రవాదాన్ని అణచి వేయాలని కోరారు. కె.పవన్, వీహెచ్‌పీ నాయకులు పల్నాటి బుజ్జి, వేణుగోపాల్, పీఎస్ఎన్ మూర్తి, పి.రాజేశ్వరి, బీజేపీ నాయకులు అనిల్‌ఆచార్య తదితరులు పాల్గొన్నారు.
- **ఏలూరు కలెక్టరేట్ :** 'వృద్ధుల సంరక్షణ పోషణ' చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుల శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. జేసీని కలిసిన వారిలో ఆర్ఎస్‌వీ ప్రసాదరావు, ఎ.సత్యనారాయణ, బయానంద బుద్ధా, రామస్వామి, ఫాదర్ ఉన్నారు.
- **లింగపాలెం :** : వైద్య సిబ్బంది గ్రామాల్లో మలేరియా సర్వే నిర్వహించి, ఇంటి వద్ద మురుగు నీరు లేకుండా చూడాలని, లార్వా పెరగకుండా చర్యలు తీసుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.ప్రసాద్ అన్నారు. కె.గోకవరం పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో మండలంలోని ముడిచర్లలో శనివారం ఆయన పర్యటించారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, చంద్రశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ రోజా, పద్మ, హేమలత, మార్త పాల్గొన్నారు.
- సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నూతనంగా ప్రారంభించిన బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో చేరిన విద్యార్థినుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం శనివారం జరిగింది. విద్యార్థినుల నైపుణ్యాలను మెరుగుపరచడమే కాకుండా, వారి బలహీనతలను తెలుసుకోవడానికి పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అన్నారు.
- **దెందులూరు :** కొవ్వలితో పాటు శివారు గ్రామాల్లో ఉన్న విద్యార్థులకు ఏటా వడ్లపట్ల కస్తూరి మాత మెమోరియాల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని ట్రస్టు చైర్మన్ వడ్లపట్ల సత్యనారాయణ తెలిపారు. కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శర్మ, సీనియార్ ఉపాధ్యాయుడు వడ్లపట్ల విజయ్‌కుమార్‌తో కలిసి సత్యనారాయణ విద్యార్థులకు శనివారం నగదు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన

- గ్రామాల్లో 'నేను బడికి పోతా' ర్యాలీలు
- బడిబాటపట్టిన 55 మంది బాలలు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 15 : బడి బయట పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు జూలై 11 వరకు చేపట్టిన 'నేను బడికి పోతా ' స్పెషల్ డ్రైవ్ శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ప్రారంభమైందని సమగ్ర శిక్షణ జిల్లా ఏపీసీ బి.సోమశేఖర్, డీఈవో అబ్రహం తెలిపారు. తొలిరోజు స్పెషల్ డ్రైవ్ వివరాలను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖలను సమన్వయ పరుచుకుని జిల్లాలో 65 మంది బడికి వెళ్లని పిల్లలను గుర్తించామని, వీరిలో 55 మందిని సమీప పాఠశాలల్లో చేర్పించామన్నారు. అన్ని మండలాల్లో ర్యాలీలు నిర్వహించగా పలుచోట్ల ఎమ్మెల్యేలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారని వివరించారు. తిరిగి ఈ స్పెషల్ డ్రైవ్ మంగళవారం నుంచి కొనసాగుతుందని తెలిపారు.



ఉంగుటూరులో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు

- బుట్టాయగూడెం :గ్రామాల్లో డ్రాప్ అవుట్స్ లేకుండా ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో టి.బాబు రావు సూచించారు. రామన్నగూడెం మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలలో శనివారం జరిగిన 'నేను బడికి పోతా' ర్యాలీలో ఎంఈవో పాల్గొన్నారు. ఏఎంవో కె.శిరమయ్య హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- టి.నరసాపురం : బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని విద్యాశాఖా ధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి పిలుపునిచ్చారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.
- కుక్కునూరు : మండల కేంద్రంలోనేను బడికి పోత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ గిరిభగవాన్‌దాస్. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పెదపాడు : జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించి బడి ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించామని ఎంఈవోలు సబ్బితి నరసింహామూర్తి, దేవినేని వెంకటరమణ తెలిపారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- జంగారెడ్డిగూడెం : బడిబయట ఉన్న పిల్లలందరిని బడిలో చేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమాన్ని జూలై 12 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో-2 జి.రాములు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో-1 బి.రాముడు, మున్సిపల్ కమిషనర్ ఎన్.నరేంద్రకుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కేవీ ప్రసాద్, ప్రధానోపాధ్యాయిరి కేఎస్‌వీ లోవకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కామవరపుకోట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తహసీల్దార్ జీవీఆర్ రమేష్, ఎంఈఓ డి.సుబ్బారావు తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయ బృందం కామవరపుకోట, కొత్తూరులో శనివారం నేను బడికిపోతా ర్యాలీని నిర్వహించారు. ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

చేపా.. చేపా.. ఏమైపోయావ్



కోమటిలంకలో చేపల చెరువు, పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు(ఇన్‌సెట్)

ఏలూరు రూరల్, జూన్ 15: ఏలూరు రూరల్ మండలం పామర్తిలంకలో శ్రీపర్రు గ్రామాభివృద్ధికి టీడీపీ హయాంలో 76 ఎకరాల చేపల చెరువును కేటాయించారు. దానిపై వచ్చే ఆదాయం గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు చేపల చెరువును వైసీపీ నాయకులు ఆదాయాన్ని వారి జేబుల్లో వేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో చెరువులోని చేపలు, రొయ్యలు గుట్టుచప్పుడు కాకుండా పట్టుబడి పట్టేశారు. విషయం తెలిసిన శ్రీపర్రు గ్రామస్తులు అవాక్కయ్యారు. తెలుగుదేశం హయాంలో కేటాయించిన 76 ఎకరాల చెరువును గ్రామస్తులు సాగు చేసుకుని వచ్చిన సొమ్మును గ్రామాభివృద్ధికి ఖర్చు చేసేవారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెరువును శ్రీపర్రుకు చెందిన వైసీపీ నాయకులు హస్తగతం చేసుకున్నారు. ఐదేళ్లుగా లక్షలాది రూపాయలు వారి జేబులు నింపుకున్నారని శ్రీపర్రు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారం మారడంతో చెరువులో ని చేపలు, రొయ్యలు గుట్టుచ ప్పుడు కాకుండా పట్టుబడి పట్టేయడంతో శ్రీపర్రు గ్రామస్తులు, టీడీపీ నాయకుడు గోవర్ధన్ ఆధ్వర్యంలో కోమటిలంక శనివారం వెళ్లి పరిశీలించారు. చెరువుల్లో చేపలు, రొయ్యలు మాయమవ్వడాన్ని, 76 ఎకరాల చెరువులను 10, 20, 30 ఎకరాలుగా విభజించి లీజులకు ఇచ్చి సొమ్ము చేసుకున్నట్లు గ్రహించారు. దీనిపై పోరాటం చేస్తామని సైదు గోవర్ధన్ స్పష్టం చేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్‌ను ప్రకటించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 15 : పన్నెండో పీఆర్సీని ప్రకటిం చకముందే ఉద్యోగ, ఉపాధ్యా యులకు మధ్యంతర భృతి (ఐఆర్)ను ప్రభుత్వం ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఇదే అభ్యర్థనను మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు కూడా పంపా మన్నారు. జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన పీఆర్టీయూ నాయకుల్లో సుబ్బారావు తదితరులున్నారు.

- చింతలపూడి : జీవో 117 రద్దు చేయాలని, పాఠశాలల పటిష్టతకు కృషి చేయాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శామ్యూల్ విజ్ఞప్తి చేశారు. తల్లికి వందనం కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మాత్రమే వర్తింప చేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు తక్షణం ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు.

'స్పందన' పేరు మార్పు

ఏలూరుసిటీ, జూన్ 15: స్పందన వ్యవస్థకు ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. స్పందన పేరును తొలగించి దాని స్థానే 'ప్రజా సమస్యల ఫిర్యాదులు- పరిష్కారాలు' అన్న పేరుతో ప్రజల నుంచి వినతులు స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని సకాలంలో పరిష్కరించాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో స్పందన కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేవారు. అయితే అప్పట్లో సమస్యల పరిష్కారం అంతంత మాత్రమే అన్న విమర్శలున్నాయి. ప్రజా సమస్యలు- పరిష్కారాలు అన్న పేరుతో వినతుల స్వీకరణపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసింది. అలాగే పింఛన్ల పంపిణీకి 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరుతో లబ్ధిదారులకు పింఛన్ అందజేసేది. అయితే గత ప్రభుత్వం ఆ పేరును వైఎస్ఆర్ పింఛన్లుగా మార్పు చేయగా తాజాగా రాష్ట్రంలో కొలువు దీరిన కూటమి ప్రభుత్వం తిరిగి ఎన్టీఆర్ భరోసా పేరుగా మార్పు చేసింది.

శ్రీవారికి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి పూజలు



ద్వారకాతిరుమల, జూన్ 15: చిన వెంకన్న క్షేత్రాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటే శ్వరరావు శనివారం ఉదయం కుటుంబ సమేతంగా సందర్శించి పూజలు చేశారు. అధికారులు, అర్చకులు దేవాలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. తొలుత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపు కున్నారు. అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు. డిప్యూటీ ఈవో బాబూరావు స్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందించారు. నాయకులు ఇమ్మడి రత్నాజి, తూంపాటి పద్మవరప్రసాద్, ఏపూరి దాలయ్య, కూరాకుల బుజ్జి, గుణ్ణం రవికుమార్, వాసిరెడ్డి ప్రవీణ్ కుమార్, వాసిరెడ్డి రామకృష్ణ, రేపూరి వెంకటేశ్వరరావు, కూనపాము రామారావు పాల్గొన్నారు.

జనసేనలో భారీ చేరికలు



స్థానిక జనసేనలో చేరిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 15 : స్థానిక 42వ డివిజన్ కొత్తపేట తదితర ప్రాంతాలకు చెందిన 50 మంది యువకులు డివిజన్ ఇన్‌చార్జి అగ్గాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పవరుపేట జనసేన కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు వారికి పార్టీ కండువాలు కప్పి అభినందించారు. పార్టీ నిర్ణయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. కొత్తగా చేరిన నాయకుల్లో ఘంటా రాజు, నరసపల్లి సత్యనారాయణ, ఘంటా హేమంతు, శ్రీనివాస్, ఘంటా దుర్గాపవన్, ఊడి వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి



నిడమర్రులో స్కూల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఉంగుటూరు, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరులో ఎమ్మెల్యే ధర్మారాజు శనివారం పాఠ్య పుస్తకాల కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. సర్పంచ్ బండారు సింధు, మండల టీడీపీ అధ్యక్షులు పాతూరి విజయకుమార్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, డీవైవో రవీంద్రభారతి, రెడ్డి చెందు. బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి, అయ్యప్ప, హెచ్‌ఎం తోట మీనా కుమారి తదితరులు పాల్గొన్నారు. తొలుత చిన వెల్లమిల్లిలో శివాలయంలోను ఉంగుటూరు చల్లాలమ్మవారి అలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

- నిడమర్రు : గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మండలంలో గల ఏడు ఉన్నత పాఠశాలల విద్యార్థులు సుమారు 100కి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శనివారం స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. ఎంఈవోలు పి.శేషు, కె.రాంబాబు, హెచ్‌ఎంలు, జనసేన నాయకులు మైలవరపు సురేంద్ర పాల్గొన్నారు.
- భీమడోలు : బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా భీమడోలు జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమానికి ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. నేను బడికి పోతా ర్యాలీని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని నెహ్రూనగర్ కాలనీకి చెందిన డ్రైనేజీ పూడికతీత పనులను ఎమ్మెల్యే ధర్మరాజు పరిశీలించారు. ఏ ప్రాంతం కూడా ముంపునకు గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మండల పార్టీ అధ్యక్షుడు ప్రత్తిమదన్, తాటిమళ్ల రామ్మూర్తి, నీలం అజయ్, యర్రంశెట్టి ఫణి, వెంకటేశ్వరరావు, మండల పార్టీ జనసేన అధ్యక్షుడు ప్రత్తి మదన్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

పచ్చమట్లతో భేటి

ఏలూరు కార్పొరేషన్ : ఉంగుటూరు ఎమ్మెల్యే పచ్చమట్ల ధర్మారాజుతో శనివారం జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు కొద్దిసేపు భేటీ అయ్యారు. జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ప్రభుత్వ పరిశీలనలు, నిర్ణయాలు, తదితర అంశాలపై చర్చలు జరిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత కూటమిపై ఉందన్నారు. ఇచ్చిన హామీలన్నీ దశల వారీగా అమలు చేస్తేనే ప్రజల్లో పార్టీకి ఆదరణ పెరుగుతుందని స్పష్టం చేశారు. వారి వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. తొలుత అప్పలనాయుడు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు. దుశ్శాలువాతో సత్కరించారు.

అసంపూర్తిగా మిగిలిన రోడ్లను పూర్తి చేయండి



దెందులూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద చెత్తను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెదపాడు, జూన్ 15 : అసంపూర్తిగా మిగిలిన రహదారులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు, స్థానిక నాయకులతో శనివారం సమీక్షించారు. ఆయా గ్రామాల్లో జరిగే పనులను స్థానిక నాయకులు నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించాలన్నారు. నాయకులు బొప్పుడి కాశీబాబు, గుత్తా అనిల్, మోరు శ్రావణి, గారపాటి రామసీత పాల్గొన్నారు

- పింఛన్ల పంపిణీపై సమీక్ష : కూటమి పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ, సచివాలయ కార్యదర్శులను ఎమ్మెల్యే ప్రభాకర్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై సచివాలయ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో సమీక్షించి, వారికి పలు సూచనలు చేశారు.
- కుక్కునూరు : దెందులూరు ఎమ్మెల్యేగా గెలిచిన చింతమనేని ప్రభాకర్‌ను కుక్కునూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మండల సమస్యలను చింతమనేని దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మునిశెట్టి నాగేశ్వరరావు, రావులపాటి శరత్, నర్సారావు, చినవెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రామ్‌ప్రసాద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.
- పెదపాడు : మానవాళికి దేవుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడచు కోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పాతముప్పర్రులో ఏసు తిరు హృదయ దేవాలయ ప్రారంభం ఘనంగా జరిగింది. ఏలూరు మేత్రాసనం వికార్ జనరల్ ఫాదర్ బాల ప్రత్యేక ఆరాధన, దివ్య బలిపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రసంగించారు. అనంతరం దేవాలయం ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.
- దెందులూరు : మండలంలో భారీగా చెత్త పేరుకుపోతే అధికారులు ఏమి చేస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో అన్ని గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. వారం రోజుల్లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహిస్తానన్నారు. ఆయన వెంట టీడీపీ నేత గారపాటి కొండయ్యచౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు, సంపంగి వేణుగోపాల తిలక్, సర్పంచ్ తోట ఏసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం, డాక్టర్ పసుమర్తి మధుబాబు, మండల స్థాయి అధికారులు ఉన్నారు

సీఎం దృష్టికి ఏజెన్సీ సమస్యలు



సీఎంను కలిసిన దుర్గారావు

బుట్టాయగూడెం, జూన్ 15 : ఏజెన్సీలో నెలకొన్న సమస్యలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏజెఏసీ వైస్ చైర్మన్ కుర్సం దుర్గారావు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. సచివాలయంలో సీఎంను శనివారం దుర్గారావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీవో నెంబరు 3, పోలవరం నిర్వాసితుల సమస్యలను విన్నవించినట్లు దుర్గారావు తెలిపారు. హోమ్‌మంత్రి వంగలపూడి అనిత, ఇతర మంత్రులను కలిసి ఆర్&ఆర్ సమస్యలను తెలిపానన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. సీఎంను కలిసివారిలో ఎస్టీ సెల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సివేరి దొన్నదొర, బి.విజయకుమార్ ఉన్నారు.

మంత్రి రామానాయుడుకి సత్కారం



మంత్రి రామానాయుడుని సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 15 : జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నిమ్మల రామానాయుడిని శనివారం విజయవాడలోని ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, తదితరులు సత్కరించామని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ నాయకులు పి.రమేష్, నజీర్, కిషోర్, లంకేశ్వరుడు తదితరులు ఉన్నారని తెలిపారు.

వ్యవసాయ మంత్రిని కలిసిన నేతలు



మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన మండల వ్యవసాయాధికారుల సంఘం ప్రతినిధులు

ఉంగుటూరు, జూన్ 15 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడిని శనివారం మండల వ్యవసాయాధికారుల ప్రతినిదులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా శాఖా పరంగా ఉన్న సమస్యలను ఆయన దృష్టిలో పెట్టారు. మండల వ్యవసాయాధికారుల సంఘం అధ్యక్షులు బాలిన వెంకటేష్ తదితరులు ఉన్నారు.

చంటికి అభినందనలు



చంటిని అభినందిస్తున్న అంజుమన్ సభ్యులు

ఏలూరు రూరల్, జూన్ 15: ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అత్యధిక మెజార్టీతో గెలుపొందడంపై అంజుమన్ ఏమొహాఫిజిల్ ఇస్లాం సంస్థ సభ్యుల శనివారం అభినందించి ఘనంగా సత్కరించారు. అంజుమన్ సంఘం అభివృద్ధికి తనవంతు సహకారాలు అందిస్తానని చంటి తెలిపారు. అంజుమన్ అధ్యక్షుడు ఎండీ సులేమాన్, కార్యదర్శి ఎండీ అస్లామ్ షరీఫ్, కోశాధికారి ఎండీ మదార్ ఖాన్, రాజాఅహ్మద్, రీయాజ్‌ఆలీఖాన్, ఎండీ జబీఉల్లా, ఎండీఅక్బర్, ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా 'గన్ని' జన్మదిన వేడుకలు



భీమడోలులో గన్ని వీరాంజనేయులును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి తదితర నేతలు

భీమడోలు/జంగారెడ్డిగూడెం, జూన్ 15 : టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పుట్టిన రోజు వేడుకలు శనివారం భీమడోలు లోని ఆయన ఇంటి వద్ద శనివారం ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గన్ని వీరాంజనేయులుకు శుభాకాంక్షలు తెలిపారు. దెందులూరు, కొవ్వూరు, ఉంగుటూరు, ఏలూరు ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ముప్పిడి వెంకటేశ్వరరావు, పత్సమట్ల ధర్మరాజు, బడేటి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు, మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామకుమార్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ, మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, నాయకులు పరిమిసత్యనారాయణ, మద్దిపాటి నాగేశ్వర రావు, రాజాన సత్యనారాయణ తదితరులున్నారు.

ఐదు సంతకాలు హర్షణీయం



లబ్ధిదారులతో కూటమి నాయకులు, కార్యకర్తలు

చింతలపూడి, జూన్ 15: ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించగానే తొలి సంతకం ఐదు హామీలపై చేయటం హర్షణీయమని, టీడీపీ నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కూటమి కార్యకర్తలు, నాయకులతో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. స్వీట్లు పంచి, తొలి సంతకం విశేషాలను వివరించారు. కూటమి నాయకులు చిట్లూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరి రావు, కొండ్రుదేవా, టి.నాగవిజయ్‌కుమార్, చీకటి మురళీ, టి.అప్పారావు, కె.రమేష్, రాజారత్నం, పాషా పాల్గొన్నారు.

రాత్రివేళ పోలీసుల తనిఖీలు

ఏలూరు క్రైం, జూన్ 15 : జిల్లాలో రోడ్డు ప్రమదాల నివారణ, నేరనియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని రాష్ట్ర, జాతీయ, ఇతర రహదారులపై శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకూ పకడ్బందీగా గస్తీ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు.

మంత్రి పార్థసారథిని కలిసిన టీడీపీ శ్రేణులు



చాట్రాయి, జూన్ 15: రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని మండలంలోని జనార్ధనవరానికి చెందిన టీడీపీ నాయకులు మాదాసు చంద్రకళ, కలకొండ భాస్కరరావు, వంగల సుబ్బారావు, పామర్తి నాగ రాజు, కోవిలంపాటి పవన్, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు శనివారం విజయవాడలో కలసి అభినందించారు. రాష్ట్ర కనీస వేతన మండలి మాజీ సభ్యుడు చాగంటి నరసింహారావు, పర్వతాపురానికి చెందిన టీడీపీ నాయకులు ఉయ్యాల దిలీప్‌కుమార్, సీహెచ్.మల్లేశ్వరరావు, బయగాని మల్లికార్జున రావు, బూబత్తుల చెన్నారావు మంత్రిని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రికి లోపూడి నాయకుల అభినందన



ముసునూరు: మంత్రి పార్థ సారథిని లోపూడి టీడీపీ నాయకులు శనివారం అభినందించారు. చలమాల మల్లేశ్వరరావు, నక్కా చెన్నారావు, పొదిలి అశోక్, డోలా రాంబాబు, పేరం గంగరాజు తదితరులు విజయవాడలో మంత్రిని సన్మానించి అభినందించారు. లోపూడిలో గత ఎన్నికల్లో వైసీపీకి సుమారు 650 మోజార్టీ రాగా ఈ ఎన్నికల్లో ఆ మోజార్టీని 160 ఓట్లుకు పరిమితం అయ్యేలా నాయకులు చేసిన కృషిని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి ప్రశంసించారు.

మంత్రి పార్థసారథి చొరవతో..

సప్లై చానల్ మరమ్మతుకు అంచనాలు



సప్లై చానల్‌ను పరిశీలిస్తున్న అధికారులతో రైతులు

ముసునూరు, జూన్ 15: మంత్రి పార్థసారథి చొరవతో గుడిపాడు సప్లై చానల్ మరమ్మతులకు ఇరి గేషన్ అధికారులు శనివారం అంచనాలు తయారు చేశారు. శుక్రవారం ఆయకట్టు రైతులు విజయవాడలో మంత్రి సారథిని కలసి సప్లై ఛానల్ పరిస్థితిని వివరించగా, ఆయన వెంటనే స్పందించి అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించడంతో లోపూడి తమ్మిలేరు నుంచి గుడిపాడు, గుళ్ళపూడి, వలసపల్లి గ్రామాల్లో ఉన్న 4 చెర్వులకు నీరు వెళ్ళేందుకు 3.8 కిలో మీటర్ల పొడవుగల సప్లై చానల్‌ను ఇరిగేషన్ ఈఈ గంగయ్య, డీఈ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కొల్లి గంగారామ్, మందలపు శ్రీనివాసరావు, ఎం.సోమేశ్వరరావు, గద్దె రఘుబాబు, వలసపల్లి రామ్మోహన్, ఊరకర్ణం కృష్ణయ్య, మేదరమెట్ల సురేంద్ర తదితరులు మాట్లాడుతూ ఈ చెరువుల కింద 1300 ఎకరాల ఆయకట్టు ఉందని ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం ఈ ఛానల్ మరమతులు అరకొరగా చేయడంతో చెరువుల్లోకి నీరుచేరక పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ చానల్‌లో ముళ్ళకంచెలు పెరిగి పూడిపోయిందన్నారు. తమ్మిలేరులో వరద ప్రవాహం కొనసాగిన ఈ సప్లై చానల్ నుంచి చెరువుల్లోకి చుక్కనీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. దీనిపై మంత్రికి వివరించడంతో ఆయన వెంటనే మరమత్తులకు కావాల్సిన నిధులపై అంచనాలు తయారుచేయాలని ఇరిగేషన్ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తమ సమస్యలపై మంత్రి స్పందించడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి చర్యలేవీ?



సమస్యలపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు (ఇన్‌సెట్) చైర్‌పర్సన్ త్రివేణి దుర్గ

నూజివీడు టౌన్, జూన్ 15: అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటుకు డీపీఆర్ (డీటేల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు)ను ఇచ్చి పట్టణంలో పక్కా డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ కోరారు. నూజివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ అధ్యక్షతన మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో ట్రిపుల్ ఐటీ మురుగునీటి తరలింపు పనులు ఎంతమేరకు వచ్చాయో అధికారులు చెప్పాలన్నారు. దీనిపై మున్సిపల్ డీఈ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఇప్పటికే మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు రాలేదని, మంత్రి పార్థసారథి సూచనల మేరకు తిరిగి టెండర్ పిలుస్తామన్నారు.

ఇంటి పన్ను చెల్లింపునకు నెల రోజులు గడువివ్వండి..

మార్చి, ఏప్రిల్ నెలల్లో డిమాండ్ నోటీసులను ఇవ్వాల్సి ఉండగా, ఇప్పుడు పంపిణీ చేసి తక్షణం పన్ను చెల్లించమనడం సరి కాదని, మరో నెలపాటు సమయం ఇవ్వాలని టీడీపీ సభ్యులు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి తెలిపారు.

సీఎం ఫొటో పెట్టలేదేం?

సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటాన్ని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేయకపోవడంపై దుర్గాప్రసాద్, ఇతర టీడీపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారిన తరువాత కూడా జగన్‌రెడ్డి ఫొటోనే ప్రధానంగా ఉంచటంపై టీడీపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి అధికారులు ఫొటోలను మార్పు చేయడంతో టీడీపీ సభ్యులు శాంతించారు.

నేడు నూజివీడుకు మంత్రి పార్థసారథి

నూజివీడు, జూన్ 15: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొలుసు పార్థసారథి మంత్రిగా తొలిసారి నూజివీడు నియోజకవర్గంలోకి ఆదివారం రానున్నారు. నూజివీడు శాసనసభ్యుడిగా ఎన్నికైన అనంతరం రాష్ట్ర మంత్రివర్గంలో సీఎం చంద్రబాబు పార్థసారథికి చోటివ్వడంతో ఆయన శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నూజివీడు నియోజకవర్గంలో పర్యటిస్తారు. నూజివీడు నియోజకవర్గ పార్టీ నాయకులు మంత్రి సారథికి భారీ స్వాగత సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ నుంచి వస్తున్న ఆయన తొలుత హనుమాన్ జంక్షన్ వద్ద ఆంజనేయస్వామికి పూజలు చేసిన అనంతరం నూజివీడు మండలం సీతా రాంపురం పెట్రోల్ బంకు నుంచి భారీ ర్యాలీతో నూజివీడు పార్టీ కార్యాల యానికి చేరుకుంటారు.

రేపటి నుంచి అందుబాటులో కామినేని

కైకలూరు, జూన్ 15: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఈ నెల 17, 18 తేదీల్లో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందిన ఆయన సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆయన స్వగ్రామమైన కైకలూరు మండలం వరహాపట్నానికి చేరుకుంటారు. 18వ తేదీ ఉదయం 10 గంటలకు కలిదిండి మండలం ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తారు. అనంతరం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండవల్లి జడ్పీ హైస్కూల్లో, ముదినేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు కైకలూరు-కోరుకొల్లు రోడ్డు సెంటర్లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహి స్తారు. అనంతరం విజయవాడ వెళ్తారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొంటారని ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు.







చాట్రాయి మండలం తుమ్మగూడెం, కైకలూరు, కలిదిండి భాస్కరరావు పేటలో నేను బడికి పోతా ర్యాలీల్లో అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు



నేను బడికిపోతా

పిల్లల్ని బడికి పంపాలంటూ ర్యాలీలు



ముదినేపల్లిలో అధికారులు, విద్యార్థుల ర్యాలీ

చాట్రాయి, జూన్ 15: తుమ్మగూడెం ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాల హెచ్ఎం గంపా వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం నేను బడిపోతా కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం, ఏఎన్‌యం, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్ళి తల్లిదండ్రులను కలుసుకొని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనం మొదలైన సదుపాయాలపై వివరించి పిల్లలను బడిలో చేర్పుకున్నారు. హెచ్ఎం వెంకట్రావు మాట్లాడుతూ 100 శాతం బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు.

ముసునూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యాబోధనతోపాటు ఉచిత సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. మండల వ్యాప్తంగా శనివారం నేను బడికి పోతా అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ముసునూరులో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ జవహర్ బాజి, విద్యార్థులతో కలసి ఎంఈవో ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశా లల్లో చేర్పించడం, స్టూడెంట్ కిట్లు అందించడం, బడిలో చేరిన పిల్లల సామర్థ్యాలను మదింపు చేయడం, వయస్సుకు తగిన తరగతుల్లో చేర్చి ఆ స్థాయికి తగ్గ బ్రిడ్జి కోర్సులను అందించడం, పిల్లలందరిని బడిలో చేర్చడం తదితర కార్యక్రమాలను చేయాల్సి ఉందని ఎంఈవో వివరించారు.

విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు

కైకలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నూతన ప్రభుత్వం అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తుందని ఎంఈఓ డి. రామారావు అన్నారు. శనివారం కైకలూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బడికి పోతా వారోత్సవాల్లో భాగంగా బాలికా ఉత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాం. ఎంఈఓ-2 వి. శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పంపాలి

ముదినేపల్లి: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని ముదినేపల్లి తహసీల్దార్ ఎస్.లక్ష్మీ నరస కుమారి కోరారు. శనివారం ముదినేపల్లిలో విద్యాశాఖ చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవో కె.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలున్నాయని, తల్లికి వందనం పథకం కింద పాఠశాలలకు వెళ్లే విద్యార్థులందరికీ ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. బడి ఈడు వచ్చిన పిల్లలందరినీ పాఠశాలలకు పంపాలని కోరారు. ఆర్ఐ శివకుమార్, స్థానిక హైస్కూల్ హెచ్ఎం విజయ కుమార్, ఉపాధ్యాయులు, హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



ముసునూరులో ర్యాలీ

కలిదిండి: ఆరు సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలలోపు ఉన్న బాలబాలికలందరిని వంద శాతం పాఠశాలల్లో చేర్పటమే నేను బడికి పోతా లక్ష్యమని ఎంఈవో ప్రభాకర్ బాబు అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంపై శనివారం కలిదిండి, భాస్కరరావుపేటల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జూలై 12 వరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు.



కామినేనికి ఎంపీ మహేష్ పరామర్శ

కైకలూరు, జూన్ 15: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ పరామర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కామినేని గృహంలో ఆయనను పరామర్శించి త్వరగా కోలుకుని ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు కైకలూరు టీడీపీ నేతలు టీకేఎం నాని, పూల రామచంద్రరావు, బోయిన శ్రీనివాస్, కరేటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న చలసాని



ముదినేపల్లి, జూన్ 15 : కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఘన విజయం సాధించినందుకు తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహన రావు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిన మొక్కు తీర్చుకున్నారు. కామినేని విజయం సాధిస్తే తన తలనీలాలు సమర్పిస్తానని మొక్కుకున్న నేపథ్యంలో మొక్కు తీర్చుకున్నారు. కామినేని పూర్తి ఆరోగ్యంతో ప్రజా సేవలో ఉండాలని జగన్మోహన్‌రావు ఆకాంక్షించారు.



కృత్రిమ కాళ్ల అందజేత

ఆగిరిపల్లి, జూన్ 15: కృత్రిమ అవయవాలు ధరించి ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని గుడివాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని లాగిశెట్టి ద్రాక్షవల్లి అన్నారు. తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రం సహకారంతో తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన మూడీ చేతన్, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన కొల్లూరి చెన్నకేశవులకు కృత్రిమ కాళ్ళను అందజేశారు. హీల్ కార్యదర్శి లక్ష్మి, సీఈవో అజయ్‌కుమార్, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



శ్రీరామరాజు

ముదినేపల్లి, జూన్ 15 : దేవరం గ్రామంలో చేపల చెరువుపై కాపలా ఉంటున్న పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలికి చెందిన దండు శ్రీరామరాజు (76) అదృశ్యమయ్యాడు. ఈ నెల 13న ఆయన కాపలా ఉంటున్న చెరువు నుంచి ఆవు పారిపోతుండగా, పట్టుకునేందుకు వెంబడిస్తూ వడాలి వరకు వెళ్లాడు. ఆవు జాడ తెలియలేదు. వెంబడించిన ఆ వృద్ధుడు తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో శనివారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.



